**కథ**

# మధురం, మధురం ఈ ప్రణయం!

**ఆ గ్లాస్ విండో అంటే అమితమైన యిష్టం మధురకి. తనాఫీసులో నాలుగో అంతస్తులో వున్న ఆ కిటికీలో నుండి కనిపించే అద్భుత దృశ్యాన్ని చూస్తూ ప్రపంచాన్నే మర్చిపోతుంది తీరికైనప్పుడల్లా. దూరంగా ఎత్తయిన కొండలు, వాటి మీద ధీటుగా నిలబడిన చక్కని భవనాలు, వాటి క్రిందుగా ఆకుపచ్చ రంగు ఒళ్ళంతా ఒలకబోసుకున్నట్టుగా కనిపించే చిన్న చిన్న లోయలు. సాయంత్రం పూట బారులు తీరి గూళ్ళకి పయనమైపోయే పక్షి గుంపులు. బ్యాక్ డ్రాప్‌లో అనంత వినీలాకాశం. ఆ విండో ఫ్రేంలోకి ఓ చక్కని సీనరీ అమరినట్లై నయనానందకరంగా ఉంటుంది.**

మబ్బులు కమ్మినవేళ ఇంకా కమనీయం! తన సీటు నానుకుని ఉన్న ఆ కిటికీలోంచి చూస్తూ మధుర తరచుగా మధురోహల్లోకి జారుకుంటుంది. ఇప్పుడూ అదే పనిలో తనని తాను మర్చిపోయి ఏదో లోకాల్లో తేలియాడుతోంది. తొలకరి ఏ క్షణాన్నయినా పుడమిని పలకరించడానికి తపనపడిపోయేలా వున్న ఆ వాతావరణం ఎంతో ఆహ్లాదంగా వుంది. మధుర మనసులో తెలియని తన్మయత్వంతోపాటు ఒక సన్నటి వెలితిలాంటి ఫీలింగ్ కలగాపులగమై గమ్మత్తయిన అనుభూతి. అది మోదమో, ఖేదమో తేల్చుకోలేని సందిగ్ధం.

ఇంటర్‌కమ్ గణ గణ మంది. ఆ సవ్వడి మధుర హృదయంలో రాగాలు ఒలకబోసింది. అది పలికే తీరే ఎవరు ఫోను చేస్తున్నారో తనకి తెలిసిపోతుంది. ఆ శబ్దం తన గుండె వేగాన్ని పెంచేసి ఏమీ తెలియని అమాయకుడిలా వుండే వంశీ చేసింది.

''ఏమిటింత ప్రొద్దున్నే గుర్తుకు వచ్చాను'' మధుర గొంతులో తెలీకుండానే మాధుర్యం ఒలికింది.

''అరే! నేనేనని మీకెలా తెలిసిందబ్బా!'' అవతల వంశీ ఆశ్చర్యం.

''అదంతేకాని, ఇంతకీ ఏమిటి విశేషం?'' మధుర ఆత్రుత.

''ఏం లేదు.. ఆఫీసుకి రాగానే మీ గొంతోసారి వీనులవిందుగా విని హలో చెప్పాలనిపించిందంతే. బావున్నారా? అన్నట్టు సాయంత్రం వూరెళుతున్నాను. వీకెండ్ కదా.. మళ్ళీ మండే మార్నింగ్ వచ్చేస్తాను. వుంటాను. సీ యూ నెక్స్ట్ వీక్'' అంటూ పెట్టేశాడు.

ఆరోజంతా ఏదో పోగొట్టుకున్న దానిలా అన్యమనస్కంగానే గడిపేసింది. సాయంత్రమవుతుంటే, వంశీ వూరెళ్ళే టైమ్ దగ్గర పడుతుందనే ఆలోచన సన్నగా గుండెల్ని నొక్కుతోంది. సరిగ్గా నాలుగున్నరకి మళ్ళీ తన ఫోన్..

''మధురగారూ, నేను బయలుదేరతాను మీరు సెలవిప్పిస్తే'' అంటూ సరదాగా అన్న వంశీ మాటలతో ప్రొద్దుట నుండీ పడిన యాతనంతా ఎగిరిపోయినట్లైంది.

తనూ నవ్వేస్తూ- ''నేను వద్దంటే మానేస్తారా మరి'' రెట్టించింది.

వంశీ కూడా తెలివిగా- ''మీరలా అనరు పాపం. ఒకవేళ అన్నా మానేస్తే మీరు సంతోషిస్తానంటే. అంతకన్నా నాకేం కావాలి?'' అన్న మాటలు మధుర మనసులోని సున్నిత స్థానాల్లోకి వెళ్ళి దాక్కున్నాయి.

మధుర కిలకిలా నవ్వుతూ- ''మాటల్తో బాగా బోల్తా కొట్టిస్తారు కానీ, వెళ్ళిరండి. హేపీ జర్నీ'' అనగానే..

''ఓ విషయం చెప్పనా? మీ నవ్వు చాలా బాగుంటుంది. మీ రూమంతా మల్లెలు విరగబూసుండాలే. ఏదీ ఇంకోసారి నవ్వండి'' అంటూ కవ్వించాడు.

''థాంక్స్. టైమవుతుంది. వెళ్ళిరండి'' ఫోన్ కట్ చేసింది.

మధుర, వంశీల పరిచయం చాలా విచిత్రంగా మొదలైంది. ఆ రోజు మధుర కాన్ఫరెన్స్‌కి కావాల్సిన అర్జంటు రిపోర్ట్ రెడీ చేసి ప్రింటవుట్ తీద్దామని ప్రింటర్ ఆన్ చేస్తే అది కాస్తా మొరాయించుకు కూర్చుంది. ఎన్ని రకాలుగా ప్రయత్నించినా అది వీసమైనా కదల్లేదు. ఇక లాభం లేదనుకుని ఇంటర్‌కమ్‌లో ఇంకో బిల్డింగులోనున్న సిస్టమ్స్ డిపార్ట్‌మెంట్‌కు ఫోను చేసింది.

''హలో సురేష్. నా ప్రింటర్ పనిచెయ్యడం లేదు. అర్జంటుగా రావాలి. త్వరగా'' కంగారు పెట్టేసింది.

''మేడమ్! నేను సురేష్‌ని కాదండీ. వంశీ..వంశీకృష్ణని. సురేషింకో గంటలో వస్తాడు. ఇంకో గంటాగి కాంటాక్ట్ చేయండి'' ఆ కంఠంలో కొంచెం ధీమా!

''కుదరదు! గంటాగే ప్రసక్తే లేదు. సురేష్ లేకపోతే మీరైనా రావాలి. చాలా అర్జంట్'' తన హడావిడిలో క్రొత్తగా వచ్చిన ఆ సిస్టమ్ మేనేజర్ని కూడా దబాయించేసింది.

''అసలు మీరెవరండీ బాబూ? ఎక్కడకి రావాలి?''

వివరాలు వినగానే ఏమనుకున్నాడో ఏమో అయిదు నిముషాల తర్వాత మధుర కేబిన్లోకి..

''మేడమ్ అయామ్ వంశీ'' అంటూ అడుగు పెట్టినబ్బాయిని తలతిప్పి చూసి 'కుర్రాడు బాగున్నాడు' అని మనసులో అనుకుని-''ప్లీజ్ కమ్! ఐయామ్ మధుర. ఏమిటో యివ్వాళే ఈ ప్రింటరు మొరాయిస్తోంది. కాస్త త్వరగా చూడండి'' అంటూ దారిచ్చింది.

వంశీ టకటకా రకరకాల కమాండ్లిచ్చినా కదలక మెదలకుండా కూర్చుందది. అమ్మాయి ముందు తను అభాసుపాలవకూడదనే పట్టుదలతో ప్రయత్నం చేస్తూనే వున్నాడు. ఇద్దర్లోనూ అశాంతి పెరిగిపోతోంది. అనుమానం వచ్చి ప్రింటర్ కార్డువైపు సరి చేయబోతే అదసలు కనెక్ట్ చేసే లేదు.

పేపర్లేవో హడావుడిగా సర్దేస్తున్న మధురవైపు తిరిగి ''మేడమ్ ప్రింటర్ కనెక్ట్ చేయలేదసలు మీరు'' అంటూ చిన్నగా నవ్వాడు.

''ఓ మైగాడ్!'' అంటూ అంతవరకూ పడ్డ టెన్షన్ మర్చిపోయి పక పకా నవ్వేసింది సీట్లో కూలబడుతూ.

ఒక్కక్షణం మౌనంగా, మ్యూజికల్‌గా వున్న ఆమె నవ్వుని ఆస్వాదిస్తున్నట్లుగా ఆమె ముఖం చూసి, గబగబా తనే ప్రింటవుట్లు తియ్యడం

మొదలుపెట్టాడు. ఈలోగా బజర్ నొక్కి కాఫీ తెప్పించింది మధుర.

''మీ కార్పొరేట్ ఆఫీస్ కాఫీ చాలా బాగుంది'' కళ్ళెగరేశాడు.

మిగతా ఆఫీసులకన్నా కార్పొరేటాఫీస్ కాఫీ స్పెషల్‌గా వుంటుందని తక్కిన వాళ్ళకి అక్కసుందని తెలిసి నవ్వుకుంది.

ఆ తర్వాత అతన్ని మర్చిపోయింది. కానీ వంశీ మాత్రం ఏదో వంకతో పలకరించాలని ప్రయత్నించేస్తూ వచ్చాడు.

ఓ రోజు తను ఫోన్ చేస్తే ఆ గొంతు బెంగుళూర్ కంపెనీ కుమార్‌దిలా వుంటే ''హాయ్ కుమార్! మీరెప్పుడొచ్చారండీ?'' అంది సంభ్రమంగా.

''ఎవరండీ బాబూ ఆ కుమార్! అంత ఆనంద పడిపోతున్నారు. నేను వంశీనండీ'' ఆ గొంతులో చిన్న అసూయ పొడ!

''అరే మీరా? అచ్చు మీ గొంతు కుమార్ గొంతులా వుంటేనూ! అతను మన బెంగుళూరు కంపెనీలో వుంటాడు. మేమిద్దరం మంచి ఫ్రెండ్స్! ఇంతకీ మీరెందుకు ఫోన్ చేశారు?''

''ఏంలేదరా రికే! మాట్లాడి చాలా రోజులైందని మాట్లాడాలనిపించింది''


ఇదేమిటీ అబ్బాయికింత ధైర్యం? తనకి ఆఫీసులో మంచి ఎఫిషియింటనీ, పని తప్ప ఇతరత్రా విషయాలు పట్టవనీ, మంచి పేరుతో సహా గర్వం, రిజర్వ్‌డ్, టాస్క్ మాస్టరనే బిరుదులు కూడా వున్నాయి. చాలా దగ్గరైన వాళ్ళు తప్ప తనని పలకరించడానికి వెనకాడుతారు మిగతా వాళ్ళు.

''చెప్పండేమిటో'' కేజువల్‌గా అంది.

''ఏం చెప్పను?''

''ఇది మరీ బాగుంది. ఫోను చేసింది మీరు. నన్నే అడుగుతున్నారా?'' అప్రయత్నంగా చిరునవ్వు కదిలింది పెదాలపై.

''మీరు బాగానే మాట్లాడుతున్నారుగా పలకరిస్తే. మరెందుకందరూ మీ గురించలా చెప్పుకుంటున్నారు?'' ఆశ్చర్యం నటించాడు.



''ఏం చెప్పుకుంటున్నారేమిటి?'' చిరుకోపం వచ్చేసింది.

''అదే మీకు కాస్త కోపం ఎక్కువనీ, అనుకున్న పని కాకపోతే తెగ చికాకు పడిపోతారనీ, అవసరమైతే అవతలివాళ్ళని దులిపిపారేస్తారనీ... వగైరా, వగైరా'' కొంటెతనం తొంగి చూసింది.

''కానిప్పుడలా కాదని తెలిసింది కదా!'' కవ్వించింది.

''ఆ! ఇంకా మీరు చాలా అందంగా, శ్రావ్యంగా, మధురంగా నవ్వగలరని కూడా తెలిసిందిలెండి'' సంభాషణ ఏదోలా పొడిగించాలనే ప్రయత్నం చేస్తున్నాడు.

ఆ తర్వాత తరచూ ఏదో మిష మీద మధురని పలకరించాలనో ఒక్కసారి మిమ్మల్ని చూద్దా

**ఎస్. సుభాషిణి**

మనో అంటూ రావడమో చేస్తూనే వున్నాడు వంశీ. అదలా పెరిగిపోతూ, ఆఖరికేనాడైనా అతను ఫోన్ చెయ్యకపోతే వెలితిగా అనిపించడం మొదలై, అది బాధలోకి, దిగుల్లోకి ఎప్పుడు మారిపోయిందో తను గమనించుకునే లోపలే అతను కాస్తా మనసులో తిష్టవేసుక్కూర్చున్నాడు. తన ప్రమేయం లేకుండానే తన జీవితంలో ఓ భాగం అయిపోయాడు క్రమంగా!

చనువు పెరిగినకొద్దీ అతని మీద అధికారం కూడా పెరిగి, తను కాంటాక్ట్ చెయ్యని రోజున అలిగి ఛడామడా వాయించేసే స్థితికి వచ్చేసింది.

## ఇషా విసుర్లు

**షూటింగ్స్‌లో పాల్గొనే హీరో, హీరోయిన్స్‌తో పాటూ వారి తల్లిదండ్రులు, కొండొకచో వారి బాయ్/గర్ల్‌ఫ్రెండ్స్ వస్తుంటారు. పెళ్లయినవారితో వారి భార్య/భర్తలొస్తారు. ప్రియాంశు చటర్జీతో ప్రేమాయణం సాగిస్తుందంటూ ఇషాపై కుప్పలుతెప్పలుగా మీడియా రాస్తున్న కథనాలు వాస్తవం కాదట. 'నాకు చాలా మంది ఫ్రెండ్స్ ఉన్నారు. ఎవరో అన్నారని నా ఫ్రెండ్స్‌ని వదులుకోలేను. ప్రియాంశుతో నాకున్న సంబంధాల గురించి చాలా రాస్తున్నారు. షూటింగ్స్‌లో ఆయనతో పాటూ ఆయన భార్య కూడా వస్తోంది. అలాంటప్పుడు ఆయనతో నాకేం సంబంధం ఉంటుంది' అని ఎదురుప్రశ్న వేస్తోంది ఇషా. ఇకనుంచి ఇలాంటి వార్తలు రాసేముందు ఆలోచించండి అని సలహా కూడా ఇస్తోంది.**

వంశీ కూడా ఆ అలకనీ, తిట్లనీ ఆనందంగా భరిస్తూ, ఇంకా ఇంకా కవ్విస్తూ, నవ్విస్తూ, భయపడ్తున్నట్లు నటిస్తూ తననలరించేవాడు.

''ఏమిటంత బిజీగా వున్నారా? మేమీరోజు గుర్తేరాలేదు'' అంటే

''మీతో తిట్టించుకుందామని'' అంటూ అల్లరిగా నవ్వేవాడు.

నోరు విప్పడం లేదు కానీ వాళ్ళ మధ్య పెరిగింది ప్రేమని యిద్దరికీ తెలుస్తూనే వుంది.

మధురని చూడాలని వంశీ తపించిపోవడం, అతనితో కబుర్లాడాలని మధుర ఎదురు చూడ్డం అంతా గమ్మత్తుగా సరదాగా వుండేది. ప్రేమ, దిగులు, బాధ, అలక, బ్రతిమాలడాలు, తమాషాలు అన్నీ కలగాపులగమైన ఆరోజులెంత మధురంగా వుండేవో... తలచుకొని తలచుకొనీ మురిసిపోయేది. అతని ఆలోచనలతోనే నిద్రకొరగడం, అతని ఆలోచనలతోనే మేల్కోడంలో ఎంతో పరవశం చెందేది. ప్రేమ అందించే ఆనందమైనా, విషాదమైనా అనుభవిస్తేనే తెలుస్తుంది అదెంత అపురూపమైన అనుభూతో! ఫూల్స్ మాత్రమే ప్రేమలో పడతారని విజ్ఞులు అనుకుంటారట. కానీ వీళ్ళకేం తెలుసు ఈ ఫూలిష్‌నెస్‌లోనే ఫుల్‌గా థ్రిల్లుందని. మేజిక్ చేసి మంత్రముగ్ధుల్ని చేసే ఈ ప్రేమ గాయాలు లేని తీయని బాధ! తలుచుకున్నప్పుడల్లా పెదవులపై చిరునవ్వుతోపాటు, కళ్ళల్లో నీళ్ళు చిప్పిల్లాలి. అదే మనసుల్ని పట్టుదారాలతో కట్టిపడేసే ప్రేమ. ఏమైపోయాయి ఈ అందమైన అనుభవాలు? పెళ్ళి, సంసారం, పాప, ఆఫీసు అంటూ తనూ యాంత్రిక జీవితపుఒరవడిలో కొట్టుకుపోతోంది. ఇదిగో యిలా ఎప్పుడో అందమైన ఆ రోజుల్ని మననం చేసుకుంటూ దిగంతాల్లోకి దిగులుగా చూడ్డం తప్ప మళ్ళీ ఆ కాలాన్ని పట్టి తేగలదా? మధుర కళ్ళు నిండుకొచ్చాయి.



''ఏంటి తల్లీ! ఆ కిటికిలోంచెవరు కనిపిస్తున్నారు? నీ కోసం క్రింద వెయిట్ చేసి చేసి అలసిపోయాను. రా! త్వరగా వానొచ్చేలా వుంది'' మధుర హజ్బెండ్ మాటలతో ఉలిక్కిపడి వెనక్కి తిరిగింది.

''ఎవర్నా? నా ప్రియుడు గుర్తుకు వచ్చాడులే! అతని ఆలోచనల్లో పడి మీరు గుర్తుకురానే లేదు సుమీ!'' అంటూ హ్యాండ్ బేగ్ తీసుకొంది బయలుదేరడానికి.

''సరే! నీకివ్వాళేమైనా సరే నీ ప్రియుడిని చూపించి తీరాల్సిందే! పద, చాలా రోజులుగా సరదా పడ్తున్నావుకదా!'' అతను నవ్వుతున్నాడు.

''సర్లే సంబరం! అంత తీరిక తమకెక్కడిది కానీ, నడవండి'' చిరచిరలాడింది మధుర.

బైక్ ఇంటి దారి కాకుండా మరో దారి పట్టడంతో అనుమానమొచ్చి-

''ఇటెక్కడికండీ'' అంది భుజం తడ్తూ.

''చెప్పాగా నీ ప్రియుడిని చూపిస్తానివ్వాళని'' అన్నాడతను స్పీడ్ పెంచుతూ.

ఏం చేస్తాడో అని మాట్లాడకుండా ఉండిపోయింది మధుర.

మబ్బులు పరుచుకున్న ఆకాశం క్రింద చల్లగాలులు చుట్టేస్తుంటే అలా బైక్‌మీద హాయిగా సాగిపోవడంలో వున్న ఆనందాన్ని అతని భుజం మీద తలానించి మౌనంగా తనివితీరా, ఎంతో అపురూపమైనదిగా అనుభూతిస్తోంది. బైక్ హైటెక్ సిటీ శిల్పారామం దాటుకొనిపోయి దూరంగా విశాలంగా వున్న ఓ ఖాళీ స్థలంలో చిన్న చిన్న కొండరాళ్ళ మధ్య ఆగింది.

''దిగండమ్మాయిగారూ!'' అన్న మాటతో ఈ లోకంలోకి వచ్చి చుట్టూ చూసి ''ఇదేమిటిక్కడకొచ్చాం'' అంది గాలికెగిరిపోతున్న చున్నీని లాగి పట్టుకుంటూ.

''చెప్పాగదా! రా కూర్చో'' అంటూ తనో బండ మీద కూర్చుని పక్కన చోటు చూపించాడు.

''ఏమిటిదంతా? వేళాకోళమా?'' మధుర మూతి ముడుచుకుంది.

''లేదు మధురా! నువ్వీమధ్య ఏమాత్రం హుషారుగా వుండటం లేదు. నాకు తెలుసు ఆఫీసు పనుల్తో, పాప పనితో, ఇంటి పనుల్తో చాలా అలసిపోతున్నావు. అందుకే అంత దిగులు కదూ! నాకు తెలుస్తోంది. రొటీన్ లైఫ్ బోరుకొట్టేస్తోంది కదా!

దానికి తోడు నేనూ నీతో సరిగ్గా స్పెండ్ చెయ్యలేకపోతున్నాను. నీకు తెలుసుగా ఆఫీస్‌లో ఎంత వర్క్‌లోడో! ఏం చెయ్యను? అందుకే పదే పదే నీ మనసు నీ ప్రియుడిని తలుచుకుంటోంది. ఆ మోజేదో ఈరోజు తీర్చేద్దామని. యిలా'' అంటూ కొంటెగా కళ్ళార్పి చూశాడు వంశీ!

''మరి కాదా? మనమిద్దరమిలా ఒంటరిగా గడిపి ఎన్ని నెలలైపోయిందో ఆలోచించండి. కాదు.. పెళ్లైన తర్వాత ఎన్నిసార్లిలా గడిపామో గుర్తుచేసుకోండి. నాకైతే ఆ రోజులే బాగున్నాయి. ఒకరికోసం ఒకరం ఎంత తపించిపోయేవాళ్ళం! కవ్వింతలు, ఏడ్పించుకోడాలు, చిన్న చిన్న పోట్లాటలు, అలకలు, తిరిగి రాజీపడ్డాలు, స్వీట్ నథింగ్స్.. అన్నీ కూడా ఎంతో బాగుండేవి. ఇప్పుడసలు నేనంటే లెక్కలేదు మీకు. ఏదో మొక్కుబడిగా బతికేస్తున్నామనిపిస్తోంది'' చెంపకి చెయ్యాన్చి దూరంగా చూస్తూండిపోయింది.

''అంటే ఏమిటి? మనం పెళ్ళి చేసుకోకుండా వుంటే బావుండేదనా నీ వుద్దేశ్యం? నీకు తెలీదు అలా మనం ప్రేమించుకుంటూ వుండిపోతే నీకే మొగానీ, నాకు మాత్రం విసుగెత్తి ఇంకో పిల్లకి తాళికట్టేసుండేవాడిని'' ఏడిపించాడు వంశీ.

''చంపేసుండేదాన్ని కాదూ నిన్నూ?'' ఆమాత్రానికే కోపం బుసలు కొట్టింది.

''మరింకేమిటి చెప్పు నీ బాధ? బుద్ధిగా నిన్నే పెళ్ళాడాను కదా! హాయిగా కాపురం చేస్తున్నాం. బుజ్జిపాపాయికి అమ్మానాన్నలమయ్యాం. ఇంకా ఏం కావాలంటావు నీకు?''

''పూర్వంలా మనమెందుకుండలేకపోతున్నాం?'' సాలోచనగా అంది మధుర.

''ఇది మరీ బాగుంది. అదెలా కుదుర్తుంది? ఇప్పుడు మనం బాధ్యతగల భార్యాభర్తలం. సంసారం ఈదాలి. పిల్లల్ని సాకాలి. డబ్బు బాగా సంపాదించాలి. ఇల్లు కట్టుకోవాలి. ఇలా ఎన్నో చెయ్యాల్సినవి వున్నాయి. ముందులా ఎలా కుదుర్తుంది చెప్పు. అయినా మధూ! జీవితంలో ఏదో ఒక దశ అద్భుతంగా వుందనీ, అదలా కంటిన్యూ అయిపోవాలని ఆశపడడం అసహజం కాదూ? జీవితంలో ఎన్నో దశలు దాటాలి. ఆనందాలు, విషాదాలు, నవ్వులు, విచారాలు, కోపతాపాలు, పోట్లాటలు, కలిసిపోడాలు, పంచుకోడాలు, బంధువులు, మిత్రులు, రకరకాల సంబంధాలు, అనుబంధాలు అన్నీ కలగలిసినదే జీవితం. అన్ని రుచులూ కలిస్తేనే కదా విందు పసందుగా వుండేది. ప్రతి మనిషీ వీటన్నిటినీ అనుభవిస్తూ జీవించాల్సిందే! ఏదో ఒక స్థాయిలో స్టక్ అయిపోతే మొనాటనీ సెట్ అయిపోతుంది.

నీలా ఎప్పుడూ స్వాప్నిక జగత్తులో విహరించడం నిజంగా జీవితంలో సాధ్యం కాదమ్మాయ్! అది గ్రహించుకో.

ఆలోచించి అవస్థపడడం తప్ప లాభం లేదు. నిజమే అప్పుడప్పుడూ రొటీన్ లైఫ్ రోత పుట్టిస్తుంది. అటువంటప్పుడు కాస్త ఛేంజ్ వెతుక్కుంటే కాస్త రిలీఫ్''

''మనమిద్దరం ఇప్పుడు లవర్స్ కాదు. అది అర్థం కావాలి నీకు. భార్యాభర్తలం. ఓ పాపకి తల్లిదండ్రులం. బాధ్యతలు పెరగలేదూ?

పాపని చదివించాలి, పెళ్ళి చెయ్యాలి.

దానికి పెళ్లయితే అత్తామామలమవుతాం. దానికి మళ్ళీ పిల్లలు పుడితే అమ్మమ్మ, తాతయ్యలమవుతాం.

ఈ దశలన్నీ మనం ఒక్కొక్కటిగా దాటుకుపోయి చివరికి అప్పుడు ప్రేమించుకుందాం.

అది కూడా అందంగానే ఉంటుంది కదా! అవునూ మనం ముసలివాళ్ళం అయితే ఎలా ఉంటామంటావ్?'' వాతావరణాన్ని లైట్ చెయ్యాలని ప్రయత్నం.

''అమ్మబాబోయ్! మొత్తం జీవితాన్ని మూడు ముక్కల్లో చూపించేశారు కదా! అయినా మనం ముసలివాళ్ళం అవ్వొద్దు. మానసికంగా ఎప్పుడూ ఇలా యంగ్‌గానే వుందాం. చివరివరకూ మీరు నన్నిలా నవ్విస్తూ, సముదాయిస్తూ, నా దగ్గరగానే ఉండాలి'' వంశీ భుజం మీద తలవాల్చేసింది అలవోకగా.

''ఓకే. ఓకే... డన్. యువరార్డర్ ఈజ్ మై ప్లెజర్. ఇప్పుడెలా ఉంది నీకు?

నీ ప్రియుడిని చూసుకున్నావుగా. సంతోషమేనా? ఇక నుండీ వీలున్నప్పుడల్లా నీకు నీ ప్రియతముడిని ప్రత్యక్షం చేయడానికి ప్రయత్నం చేస్తాను నా శాయశక్తులా. సరేనా?

ఇంక తమరు అనుమతిస్తే బయలుదేరుదాం'' చిలిపితనం చిందులేస్తూంటే పూర్వపు వంశీ కనిపించినట్లై మురిపెంగా అతన్నే చూస్తూ అంది మధుర.

''ప్రామిస్! పదండి వెళ్దాం. మన అనురాగాల పంట ఇల్లు పీకి పందిరేస్తూ అత్తయ్యని నానా తంటాలపాలు చేస్తూంటుందిప్పటికే'' అతని చెయ్యందుకుంటూ.

మధురకిప్పుడు మనసంతా తేలికై ఆకాశంలో తేలిపోతున్నట్లుంది.

అబ్బ ఎంత రిలీఫ్‌గా ఉందిప్పుడు. దిగులంతా ఎగిరిపోయింది.

బైక్ పంజాగుట్ట సర్కిల్ దాటి తనిష్క్ గోల్డ్ షాప్ ముందాగడం చూసి-

''ఏమైంది? ఏం కావాలి? ఇంటికెళ్ళిపోవాలి కదా!'' కంగారుపడింది.

''ఏం కాదు.. నీకెప్పుడూ కనీసం వేలంటైన్ గిఫ్ట్ అయినా ఇవ్వలేదని దెప్పుతుంటావు కదా! ఆ దెప్పడం ఆరోజుల్నుండీ ఇప్పటివరకూ సాగుతూనే ఉంది. ఇవ్వాళ ఆ కోరిక కూడా తీర్చేద్దామని. పద నీకేదైనా కొంటాను'' అన్నాడు వంశీ బైక్‌కి స్టాండ్ వేస్తూ.

''చాల్లెండి. చెయ్యాల్సినప్పుడు చెయ్యలేదు కాని. అదేదో మన లవింగ్ డేస్‌లో చేస్తే ఎంత సంతోషించేదాన్ని?

అయినా ఇప్పుడు ఈ అనవసర ఖర్చులేమిటి? నాకు నగలకేం తక్కువని?

ఈ నెల్లో ఫ్లాట్ బుక్ చేద్దామనుకున్నామా, మీ చెల్లి డెలివరీకి వస్తుంది.

ఈ ఖర్చుల్లో నాకిప్పుడేం వద్దు పదండి'' అక్కడే నిలబడిపోయింది మధుర.

''అద్దీ! అస్సలుగిస్సలు గృహిణిలా సెలవిచ్చావు సుమా! చూశావా నీకు బాధ్యతలు ఎలా ఆటోమేటిగ్గా అర్థం అవుతున్నాయో. మరిప్పుడు నాకు నీలో నా ప్రియురాలు కనబడ్డం లేదే?

భార్య, కోడలు, తల్లి ఇలా ఎన్నో అవతారాలెత్తితే కాని జీవితం సంపూర్ణం కాదని చెప్పా కదా! అది నీ మాటల్లోనే తేలిపోయింది.

ఇంతకీ కొననా వద్దా?'' ఆటపట్టించాడు.

''మీరొట్టి పిసినారని నాకానాడే తెలిసిపోయింది. వద్దనగానే మానేయాలని ఎత్తా?'' ఏడిపించింది.

''పిసినారనే బిరుదుని మర్చిపోవు కదా! పద తేల్చేస్తాను నేనెంత లిబరల్లో'' అంటూ చెయ్యి పట్టుకుని షాప్‌లోకి లాక్కెళ్తుంటే మధుర ముఖంలోని మెరుపులు వజ్రాల నగలతో పోటీపడ్డాయి.

★

